క్లుప్తంగా

పోలిపల్లి పైడితల్లి పండగ పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

డెంకాడ: మండలంలోని మోపాడలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తన స్వగృహంలో భోగాపురం మండలంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి పండగ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోలిపల్లి సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, మాజీ సర్పంచ్ పతివాడ రామకృష్ణ, టోల్‌గేట్ ప్రెసిడెంట్ కర్రోతు శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలంలో భక్తి గీతాలాపన..


సింహాచల దేవస్థానంలో కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

విజయనగరం టౌన్: పట్టణానికి చెందిన శ్రీవారి స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యంలో సింహాచల నృసింహ స్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి అన్నమాచార్య కీర్తనలు, భక్తి గీతాలాపన జరిగింది. సంస్థ వ్యవస్థాపకుడు ఎం. భీష్మారావు ఆధ్వర్యంలో కళాకారులు ఎంతో హృద్యంగా గీతాలు ఆలపించారు. అనంతరం ఆలయ సిబ్బంది కళాకారులను సత్కరించారు.

సెంచూరియన్‌లో గజజ్యోతి వేడుకలు


మాట్లాడుతున్న సెంచూరియన్ వర్సిటీ వీసీ పీకే మహంతి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో గజజ్యోతి–2024 వేడుకలను వీసీ ప్రశాంతకుమార్ మహంతి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ప్రతిభను చూపించేందుకు గజజ్యోతి వేడుకలు ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డీన్లు ఆచార్యులు, పీఎస్వీ రమణారావు, సన్నీడియోల్, డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలంటూ నిరసన


నల్లరిబ్బన్లతో నిరసన తెలియజేస్తున్న పంప్‌హౌస్ కార్మికులు

నెల్లిమర్ల: నెల్లిమర్ల, రామతీర్థాలు, మునిడిపల్లి పంప్‌హౌస్ కార్మికుల బకాయి జీతాలు చెల్లించాలని సీఐటీయూ నాయకుడు ఎ. జగన్‌మోహన్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం లోగా చెల్లించకపోతే మంగళవారం అర్ధరాత్రి నుంచి మంచినీటి సరఫరా నిలిపివేస్తామని ప్రకటించారు. ఈ మేరకు కార్మికులు నల్లరిబ్బన్లతో శుక్రవారం విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో కార్మికులు మురళి, అరుణ్, నారాయణరావు, రాంబాబు, రమేష్, గోవింద్, స్వామి, సత్యనారాయణ, బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యలక్ష్మికి ప్రత్యేక పూజలు


అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్ శ్రీ క్షేత్రమ్‌లో కొలువైన అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని దేవాలయంలో ధాన్యలక్ష్మి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, శ్రీనివాస్ రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి స్నపనం, పంచామృతాభిషేకాలు, అర్చనలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులకు అండగా..

- సంక్షేమ పథకాలతో ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- జీవన ప్రమాణాలు మారడంతో మత్స్యకారుల ఆనందం


చింతపల్లిలో సముద్ర తీరంలో ఒడ్డున బోట్లు

పూసపాటిరేగ: అను నిత్యం అలలకు ఎదురేగి జీవన పోరాటం చేస్తున్న మత్స్యకారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తోంది. నిద్ర లేచింది మొదలు రాత్రి వరకు ప్రాణాలకు తెగించి జీవనం సాగిస్తున్న గంగపుత్రులకు భరోసా కలిస్తూ వారి జీవితాల్లో ఆనందం నింపుతోంది జగన్ మోహన్‌రెడ్డి సర్కారు. మత్స్యకారుల ఇబ్బందులను తన పాదయాత్ర సమయంలో స్వయంగా చూసిన జగన్ మోహన్‌రెడ్డి అనంతరం ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వారి సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నారు. మత్స్యకార భరోసాను రూ. 4 వేల నుంచి పది వేల రూపాయలకు పెంచిన ఘనత జగనన్నకు దక్కుతుంది.

పెరిగిన బీమా పరిహారం..

మత్స్యకారులు ప్రమాదవశాత్తూ మృతి చెందిన ఇంతవరకు 5 లక్షల రూపాయల పరిహారం వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పరిహారాన్ని పది లక్షల రూపాయలకు పెంచారు. అలాగే మత్స్యకారులు చేపలు పెంచుకోవడానికి ఒక్కో యూనిట్‌కు ఐదు లక్షల రూపాయలు కేటాయించారు. చేపలు అమ్ముకోవడానికి మోటార్ సైకిల్, మూడు చక్రాల వాహనాలు కొనుగోలుకు రూ. 3 లక్షలు.. కొత్త బోటు, వలల కొనుగోలుకు రూ. 5 లక్షల రుణాలను 40 శాతం రాయితీపై అందజేస్తున్నారు. దీంతో మత్స్యకారుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఐదుసార్లు మత్స్యకార భరోసాను విడుదల చేయడంతో జిల్లాలో 3,908 మంది మత్స్యకారులకు ఒక్కొక్కరికీ రూ. 10 వేల చొప్పున ఐదుసార్లు లబ్ధి చేకూరింది.

20 వేలకు పైగా..

జిల్లాలో తీరప్రాంతమైన పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో 19 తీరప్రాంత గ్రామాలలో సుమారు 20 వేల మత్స్యకారులు జీవిస్తున్నారు. వీరిలో ఆరు వేల మంది వేటపై ప్రత్యక్షంగా ఆధారపడి జీవిస్తువున్నారు. ఒకప్పుడు మత్స్యకార కుటుంబాల్లో ఎక్కువమంది ఇతర ప్రాంతాలకు వలస పోయేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సంక్షేమ పథకాలు మంజూరుకావడంతో వలసలు దాదాపుగా తగ్గిపోయాయి. తాజాగా విజయనగరంలో తీరప్రాంతానికి ఫ్లోటింగ్ జెట్టీ మంజూరు చేస్తూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేసి వర్చువల్ విధానంలో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణం పూర్తయితే మత్స్యకారుల వలసలకు పూర్తిస్థాయిలో బ్రేక్ పడనుంది.

> **పథకాలు సద్వినియోగం చేసుకోవాలి**
>
> మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వివిధ రకాల సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ప్రధానంగా సీఎం మత్స్యసంపద పథకం ద్వారా మత్స్యకారులకు లాభం చేకూరుతోంది. డీజిల్ రాయితీ, మత్స్యకార భరోసాతో పాటు పలు పథకాలు అందుతున్నాయి.
>
> – చాందిని, ఎఫ్‌డీఓ మత్స్యశాఖ, విజయనగరం

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు


డెంకాడలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు కనక సింహాచలం, సర్పంచ్ గౌరి, తదితరులు

డెంకాడ: మండలంలోని డెంకాడలో పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, సర్పంచ్ పతివాడ గౌరి పలు అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. రైతుభరోసా కేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేయడంతో పాటు రిటైనింగ్ వాల్, సీసీ డ్రెయిన్లు, వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ, హ్యాండ్ బోర్లు, ఇంటింటి కుళాయిల ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పొంత్రంకి ఆదినారాయణ, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నాతవలసలో..

మండలంలోని నాతవలసలో విజయనగరం – నాతవలస ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి చాకలివీధికి రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు బమ్మిడి వెంకటరమణ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

డీడీఓలుగా పంచాయతీ కార్యదర్శులు

నెల్లిమర్ల: మండలంలోని ఎనిమిది గ్రామ పంచాయతీలకు చెందిన గ్రేడ్ – 5 కార్యదర్శులను డీడీఓలుగా నియమిస్తూ సంబంధిత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. టెక్కలి, మధుపాడ, సీతారామునిపేట, గుషిణి, గరికపేట, దన్నానపేట, ఏటీ అగ్రహారం, మల్యాడ కార్యదర్శులకు డీడీఓ ఉత్తర్వులు శుక్రవారం అందజేశారు. వీరంతా ఎంపీడీఓ జి. రామారావు, ఈఓపీఆర్‌డీ సింహాద్రిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గంట్యాడ: మండలంలోని కొండతామరపల్లి ఎస్సీ కాలనీ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే బొండపల్లి మండలం కొండపేటకు చెందిన జి.వెంకటరమణ, జి.పవన్‌కుమార్ బైక్‌పై గంట్యాడ వైపు వస్తుండగా కొండతామరపల్లి ఎస్సీ కాలనీ వద్దకు వచ్చేసరికి తామరపల్లి నుంచి ఎం.కొత్తవలస వైపు బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులు వెంకటరమణ, పవన్‌కుమార్‌లను స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు.

చెరువు ఆక్రమణకు అడ్డుకట్ట

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం శేరీపేట రెవెన్యూ పరిధిలో విజయనగరం–పాలకొండ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న కుమ్మరి చెరువు ఆక్రమణకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, పంచాయతీ సర్పంచ్ పిల్లా రామయ్యమ్మ శుక్రవారం అడ్డుకట్ట వేశారు. పంచాయతీ నుంచి కానీ, ప్రభుత్వం నుంచి కానీ ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీతో చెరువు గర్భాన్ని తవ్వేసి చెరువుగట్టును రోడ్డుగా మార్చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ పిల్లా రామయ్యమ్మ, సెక్రటరీ అప్పలనాయుడుతో కలిసి ఆక్రమణ తవ్వకాలను అడ్డుకున్నారు. దీనిపై మండల తహసీల్దార్, ఎంపీడీఓలకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. అయితే ఉన్నతాధికారుల అండదండలు లేకుండా ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఈ చెరువులో అక్రమ తవ్వకాలు జరిగే అవకాశం లేదని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజులుగా తవ్వకాలు జరుగుతున్నా అధికారుల నుంచి ఎలాంటి చర్యలు లేకపోవటంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ కీలకం


సావనీర్ విడుదల చేసిన వీసీ కె.వెంకటసుబ్బయ్య, అతిథులు

- జేఎన్‌టీయూ (జీవీ) వీసీ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: ప్రపంచ స్థాయిలో సాంకేతిక అభివృద్ధికి ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ కీలకమని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం వీసీ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. స్థానిక జేఎన్‌టీయూ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల ఐటీ విభాగం ఆధ్వర్యంలో 'ఐటీ వైయూకేటీపీ 2కే24' పేరిట రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ టెక్నికల్ సింపోజియంను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ప్రస్తుతం అంతర్జాతీయంగా జరుగుతున్న అభివృద్ధిలో ఐటీ రంగం ప్రాధాన్యం ఎంతో ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్ (ఏఐ) విస్తృత వ్యాప్తితో ఐటీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని భరోసా కల్పించారు. కోడింగ్ నాలెడ్జ్ చాలా ముఖ్యమని.. అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించగలమన్నారు. ముఖ్య అతిథులుగా ఇన్ఫోసిస్ డీసీ మేనేజర్ శ్రామిక రేగట్టే, దృశ్య ఏఐ లాబ్స్ కో ఫౌండర్ శ్రావణ్‌కుమార్, ఆర్బిటెక్ ఇన్ఫోసిస్ సీనియర్ టెక్నాలజిస్ట్ ప్రభాకర్ మనయాల హాజరై వార్షిక సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ బి.తిరుమలరావు, డబ్ల్యూ. అనిల్, వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం


ముగింపు కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, తదితరులు

విజయనగరం రూరల్: మండలంలోని కొండకరకాంలో సీతం ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు వారం రోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం శుక్రవారంతో ముగిసింది. జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి సీతం ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు పర్యావరణంపై అవగాహన, సామూహిక అస్తిత్వం, క్రమశిక్షణతో జీవించేందుకు దోహదపడతాయన్నారు. అలాగే విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కొండకరకాం జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆర్.లక్ష్మి, ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం సతేశ్వరరావు, ప్రోగ్రాం అధికారి ఎన్.సతీష్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు


డెంకాడ: నాగమణి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: ప్రభుత్వం ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడం సంతోషదాయకమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. కుమిలికి చెందిన నీలాపు అఖిలరెడ్డికి రూ. 80 వేలు.. వెలుదూటి లక్ష్మణరావుకు రూ. 26 వేలు.. కేత రోహిణిభవిష్యకు రూ. 1.40 లక్షల చెక్కు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకూ న్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, గుజ్జు సురేష్‌రెడ్డి, గాబు సూరప్పన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆపన్నులకు అండగా..

డెంకాడ: ఆపదలో ఉన్న ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. అక్కివరం గ్రామానికి చెందిన రెడ్డి నాగమణి కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయించుకోవడంతో వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన కిలా పైడిరాజు అనారోగ్యంతో ఆపరేషన్ చేయించుకోవడంతో వైద్య ఖర్చులకు రూ. 2.30 లక్షల చెక్కు.. భోగాపురం మండలం పోలిపల్లి గ్రామానికి చెందిన కర్రోతు వాణి వైద్య ఖర్చులకు రూ.50 వేల చెక్కులు అందించారు. కార్యక్రమంలో పోలిపల్లి, అక్కివరం సర్పంచ్‌లు కర్రతు వెంకటరమణ, కంది కిరణ్‌కుమార్, పోలిపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు బాలి సత్యనారాయణ, మండల వ్యవసాయ సలహామండలి సభ్యులు పతివాడ సత్యనారాయణ, కంది త్రిమూర్తులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుని విగ్రహం ఏర్పాటు


శ్రీకృష్ణుని విగ్రహ ప్రారంభం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

విజయనగరం: పురాతన ఆలయమైన సంతపేట జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీకృష్ణుని విగ్రహం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని కార్పొరేటర్ కేదారశెట్టి సీతారామమూర్తి, జగన్నాథ సేవా సంఘం ప్రతినిధి దాడి భాస్కరరావు అన్నారు. ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన కాళీయమర్దన కృష్ణుని విగ్రహాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారామమూర్తి, భాస్కరరావు మాట్లాడుతూ.. ఒకవైపు ఆధ్యాత్మికం, మరోవైపు సుందరీకరణ, ఇంకోవైపు అభివృద్ధిపథంలో నగరాన్ని అభివృద్ధి చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభినందనీయుడని కొనియాడారు. రానున్న రోజుల్లో నగరం మరింత శోభాయమానంగా వెలుగొందాలంటే ఆయనను మరోసారి శాసనసభ్యుడిగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జగన్నాథ సేవా సంఘ ప్రతినిధులు ఆడారి నగేష్, కనిశెట్టి సుధాకర్, ముల్లేటి నారాయణ, ఆడారి బుజ్జి, కాండ్రేగుల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత


శంకుస్థాపన శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు

- ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

పూసపాటిరేగ: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని.. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండంలోని కోనాడ గ్రామంలో గల వేణుగోపాలస్వామి, ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణాలకు దేవదాయ శాఖ రూ. 1.25 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో ఆయా ఆలయ పునఃనిర్మాణ పనులకు సంబంధించి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జీర్ణావస్థకు చేరుకున్న ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను కోరగా, నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మెన్ అంధవరపు సూరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, ఎంపీడీఓ ఎం.రాధిక, వైస్ ఎంపీపీలు ఎన్. సత్యనారాయణరాజు, అల్లాడ రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు దారపు అప్పలనర్సమ్మ, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, అమర గురువులు, దాడిశెట్టి త్రినాథరావు, దారపు లక్ష్మణరెడ్డి, దాడిశెట్టి గోవింద, బొద్దు ఎల్లాజీ, విజ్జపు కిరణ్‌కుమార్, దాడిశెట్టి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా 'కుమ్మరిగుంట'


ప్రమాణ స్వీకారం చేస్తున్న కుమ్మరిగుంట శ్రీనివాసరావు

విజయనగరం: వైశ్య కార్పొరేషన్ జిల్లా డైరెక్టర్ పదవి కుమ్మరిగుంట శ్రీనివాసరావును వరించింది. ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్ ఎం.డి శ్రీధర్‌రెడ్డి, శాసనసభ్యుడు వెల్లంపల్లి శ్రీనివాసరావు సమక్షంలో విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆశీస్సులతో కార్పొరేషన్ అభివృద్ధికి పాటుపడతామన్నారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం అధ్యక్షుడు నారాయణం శ్రీనివాసరావు, పట్టణ ప్రముఖులు రవ్వా శ్రీనివాస్, ఊటీ, ఆలవెల్లి శేఖర్, డిమ్స్ రాజు, పచ్చిగుళ్ల రామారావు, పెంటపాటి కామరాజు, శ్రీనివాసరావు, మురుగన్, ఉపేంద్ర, తదితరులు కుమ్మరిగుంటను అభినందించారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన


లెండి ఇంజినీరింగ్ కళాశాలలో భద్రతా ఏర్పాటు పరిశీలిస్తున్న ఎస్పీ దీపిక

డెంకాడ: సార్వత్రిక ఎన్నికల అనంతరం ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూములతో పాటు కౌంటింగ్ నిర్వహించనున్న జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో భద్రతా ఏర్పాట్లు ఎస్పీ ఎం.దీపిక శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో గదులను క్షుణ్ణంగా పరిశీలించి, అధికారులకు భద్రతాపరమైన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, భోగాపురం, విజయనగరం రూరల్ సీఐలు బి.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, డెంకాడ ఎస్సై కృష్ణమూర్తి, లెండి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ తమ్మినేని హరిబాబు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.